# పుట్టిన రోజు



ప్రొద్దున ఎనిమిది గంటలయింది. పబ్లిక్ గార్డెన్స్ బస్‌స్టాప్ వద్ద నిలబడ్డాను.

"సార్... బూట్‌పాలిష్!" అంటూ వచ్చాడో పధ్నాలుగేళ్ల కుర్రాడు.

"వద్దులే..!" అన్నాను విసుగ్గా.

"సార్... మీ బూట్లకి పాలీష్ చేసినందుకు పైసాకూడా ఇవ్వద్దు సార్!" అంటూ పాలిష్ పెట్టి కిందికి దింపాడు.

ఆశ్చర్యంతో నా చెవులను నేనే నమ్మలేకపోయాను.

"ఆశ్చర్యపడకండి సార్... ఈ రోజు నా పుట్టినరోజు. ప్రతి పుట్టినరోజుకీ మొదట చేసిన పాలిష్‌కి నేను డబ్బు పుచ్చుకోను. ఆ మహారాజులు ఇచ్చే దీవెనల వల్ల ఆ ఏడాదంతా మంచి గిరాకీ తగుల్తుంటుంది" అన్నాడు చిరునవ్వుతో.

"బాగుంది నీ నియమం. చేసేది పాలిష్, జరుపుకునేది పుట్టినరోజు పండుగలూనా?" అన్నాను.

"అలా అనకండి సార్, ఒకప్పుడు మాదీ పెద్దగా కలిగిన కుటుంబమే! కాలం కలిసిరాక ఈ స్థితికి వచ్చాం."

వాడి మాటల తీరు చూస్తుంటే నిజంగానే వాడు బతికిచెడ్డ కుటుంబంలోంచి వచ్చినవాడనే అనిపించి జాలివేసింది.

వాడు పాలిష్ చేయడం పూర్తిచేసి, "సార్.. వెళ్లొస్తాను. పెద్దలు మీరు మనస్ఫూర్తిగా నన్ను దీవించండి" అన్నాడు.

వాడి వినయానికి నేను పరవశించిపోయాను.

"కష్టపడి వృద్ధిలోకిరా!" అని మనస్ఫూర్తిగా దీవించాను. జేబులోంచి రూపాయి నోటు తీసి - "నీ పుట్టినరోజు అన్నావుగా- దీనితో మిటాయి కొనుక్కో" అని ఇచ్చాను.

"వద్దుసార్" అని వాడన్నా, బలవంతపెట్టి ఇచ్చాను. వాడు నమస్కారం చేసి పెట్టె భుజానికి వేసుకుని వెళ్లిపోయాడు. అటువంటి వాళ్లలో కూడా ఎంతటి సంస్కారవంతులు ఉంటారు!

నెలరోజులు గడిచాక, ఓ రోజున సికింద్రాబాద్ స్టేషన్‌కి పనిమీద వెళ్లి, బస్‌స్టాప్ వద్ద నుంచున్నాను.

అదికూడా ప్రొద్దుటి సమయమే. అనుకోకుండా అక్కడ ఆనాటి బూట్ పాలిష్ కుర్రవాడు- ఎవరికో పాలిష్ చేస్తూ కనిపించాడు.

అప్రయత్నంగా వాడి సమీపానికి వెళ్లాను. వాడు పాలిష్ చేయడం పూర్తిచేసి, "సార్.. వెళ్లొస్తాను. మనస్ఫూర్తిగా దీవించండి సార్. మీరిచ్చే పుట్టిన రోజు దీవెనలే నాకు జయం సార్!" అన్నాడు.

ఆ మాటలు వింటూనే కొయ్యబారిపోయాను.

– *చతుర... జనవరి '79*